ప్రజాశక్తి
ఆదివారం 26 మే 2024
5
శ్రీ సత్యసాయి





కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలన చేస్తున్న జిల్లా కలెక్టర్

కలగానే కనీస వేతనం..!

◆ శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు ◆ నిద్రమత్తులో కార్మిక శాఖ

రోజురోజుకూ నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. దీనికి తోడు అద్దెలు పెరిగాయి. కానీ కార్మికుల వేతనాలు మాత్రం అలాగే ఉన్నాయి. 11 ఏళ్లు క్రితం నిర్ణయించిన వేతనాలతోనే ఇప్పటికీ కార్మికుల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వంలో కనీస వేతనాలకు సంబంధించిన ఏర్పాటు చేసిన సలహా మండలి సిఫార్సులను సైతం గత జగనన్న ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక కష్టజీవులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. అప్పుల పాలై ఆకలి పస్తులతో అల్లాడి పోతున్నారు. ఐదేళ్లుగా పెరిగిన ధరలు, ఛార్జీల నడుమ అరకొర వేతనాలతో సంఘటిత, అసంఘటిత రంగ కార్మిక కుటుంబాలు కష్టాల కడలిలో జీవనం సాగిస్తున్నాయి.



ప్రజాశక్తి-హిందూపురం

సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం కలగా మారింది. దాదాపు 11 ఏళ్ల క్రితం 2013లో నిర్ణయించిన కనీస వేతనమే నేటికీ అధికారిక కనీస వేతనంగా కొనసాగుతోంది. దీంతో కష్టజీవులు శ్రమ దోపిడీకి, అన్యాయానికి గురవుతున్నారు. గడిచిన పది సంవత్సరాల్లో నిత్యావసర సరుకులు, సేవల ధరలు 200 నుంచి 300 శాతానికి మించి పెరిగినా కార్మికుల వేతనాలు మాత్రం 10శాతం కూడా పెరుగుదల కనిపించడం లేదు. కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించాల్సిన ప్రభుత్వాలు ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించడమే అందుకు నిదర్శనం. 2013 తరువాత కనీస వేతన సవరణ జరగ్గా, 2018 నాటికి ఐదేళ్లు పూర్తి కావస్తుండడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం వేతన సవరణపై కసరత్తు ప్రారంభించింది. పెరుగుతున్న ధరలు, జీవన ప్రమాణాల ఆధారంగా వేతన సవరణకు సంబంధించి నివేదికను సిద్ధం చేయాలని సలహా మండలిని ఆదేశించింది. అప్పటి వేతన సలహా మండలి ఛైర్మన్ రఘుపతుల రామ్మోహన్ రావు నేతత్వంలోని బందం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటన నిర్వహించి కార్మికులు, కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించింది. ఈ సందర్భంగా కనీస వేతనాన్ని రూ.21 వేలుగా నిర్ణయించాలని కార్మిక సంఘాలన్నీ డిమాండ్ చేశాయి. దీంతో పాటు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, వారి డిమాండ్లను నమోదు చేసి సలహా సంఘం నివేదికను సిద్ధం చేసింది. సరిగ్గా అదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో మొత్తం ప్రక్రియ అక్కడికే ఆగిపోయింది. దీంతో కార్మికుల కనీస వేతన కల కలగానే మిగిలింది.

కార్మికులను పట్టించుకుని జగన్ ప్రభుత్వం

కార్మిక సలహా మండలి సిద్ధం చేసి ఇచ్చిన నివేదికను 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అమలు చేయాల్సి ఉంది. అమలు చేయకుండా కనీస వేతన సలహా మండలి నివేదికను బుట్టదాఖలు చేసింది. రాష్ట్రంలో కనీస వేతన సవరణ సలహా బోర్డు ఉందా.. లేదా.. అన్నంతగా ఈ బోర్డు నిద్రావస్థలో పడిపోయింది. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్కసారి కూడా కనీస వేతన సవరణ గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. వేతన సవరణ తనకు సంబంధం లేని విషయమే అన్నట్లు ప్రభుత్వం వ్యవహరించింది.

4.50 లక్షల మంది ఎదురు చూపులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 4.50 లక్షల మంది సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. వీరంతా వ్యవసాయం, అనుబంధ రంగాలైన దాదాపు 48 రకాల షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. వాటితో పాటు అసంఘటిత కార్మికులు నిర్మాణ కార్మికులుగా, సున్నం, ఇటుక బట్టీల్లో, షాపింగ్ కాంప్లెక్సులు, దుకాణాలు, ప్రయివేటు కంపెనీల్లో, ఆస్పత్రుల్లో పనిచేస్తూ ఉన్నారు. ఎలాంటి చట్టపరమైన భద్రత, వేతన భరోసా లేని వీరికి అన్యాయం జరగకుండా, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించేందుకు వేతన సవరణ సలహా బోర్డు ఎప్పటి కప్పుడు ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తుంటుంది. ఏడేళ్ల క్రితం మొదలైన వేతన సవరణ ప్రక్రియను ఈ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించింది.

నిద్రావస్థలో కార్మిక శాఖ

కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కార్మికశాఖ నిద్రావస్థలో మునిగిపోయింది. కార్మికులకు కనీస వేతనం దక్కక శ్రమదోపిడీకి గురవుతున్నా కార్మిక శాఖ ఎంత మాత్రం పట్టించుకోవడం లేదు. కార్మి కుల తరపున వేతన సవరణ బోర్డుకు సమస్యను నివేదించడం గానీ, అధికారులపై ఒత్తిడి తేవడం గాని చేయడం లేదు. వేతన సవరణ బోర్డు నిర్లక్ష్యం, కార్మిక శాఖ నిస్తేజం జిల్లాలో 4.50 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులకు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పటికీ గతంలో నిర్ణయించిన రూ.14 వేలు అధికారిక కనీస వేతనంగా కొనసాగుతుండడంతో వీరికి శ్రమ ఫలితం దక్కడం లేదు. ఈ నేపథ్యంలోనే కనీస వేతన సవరణపై కష్టజీవుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోంది. తక్షణం కనీస వేతనాన్ని రూ.21 వేలకు పెంచాల ని వారు డిమాండ్ చేస్తున్నారు.

చట్టాన్ని అమలు చేసి కార్మికులను ఆదుకోవాలి



సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు ప్రభుత్వం సమగ్ర చట్టాన్ని వెంటనే అమలు చేసి కార్మికులను ఆదుకోవాలి. ఉమ్మడి జిల్లాలో సుమారు 4.50 లక్షలకు పైగా సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు అమలు చేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు. కార్మికులకు సమగ్ర చట్టం అనేది చాలా ముఖ్యం. అనేక ప్రభుత్వాలను సిఐటియుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వాలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగుతున్నది. దీంతో కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వచ్చే ప్రభుత్వం సమగ్ర చట్టాన్ని అమలు చేయడంతో పాటు సంక్షేమ బోర్డును సైతం ఏర్పాటు ఆదుకోవాలన్నారు.

ఈఎస్ వెంకటేష్ సిఐటియు జిల్లా కార్యదర్శి.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ చర్యలు

◆ నియోజకవర్గాల సూచిక బోర్డులు ఏర్పాటు ◆ కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. శనివారం లేపాక్షిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, హిందూపురం రూరల్ మండలం గుడ్డంపల్లి వద్ద ఉన్న బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను, భద్రతాచర్యలను కలెక్టర్ పి.అరుణ్ బాబు, జిల్లా ఎస్పి మాధవరెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు అన్నీ ముందస్తుగానే పూర్తిచేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి అధికారులు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు వెళ్లేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లన్నీ సంబంధిత రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ హాలులోకి సెల్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వంటివి అనుమతించరాదని. గుర్తింపు కార్డు లేకుండా ఎవరినీ అనుమతించరాదన్నారు. కౌంటింగ్ సిబ్బంది ఏర్పాట్లకు సంబందించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కంట్రోల్ రూమ్ ను తనిఖీచేసి ఈవిఎంల భద్రతను పరిశీలించారు. లేపాక్షి గురుకుల పాఠశాల నందు డార్మెంటు బ్లాక్ నందు మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన టేబుల్స్ ను పరిశీలించి సంబంధిత అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు. బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆవరణలో మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టడం చేయాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని, కౌంటింగ్ కోసం కూడా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. బిట్ కళాశాల, లేపాక్షి గురుకుల పాఠశాల ప్రధాన ద్వారం వద్ద బందోబస్తు పటిష్టంగా కొనసాగించాలని, 24/7 బందోబస్తు నిర్వహించాలన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. కౌంటింగ్ కోసం భద్రత, బ్యారికేడింగ్ ఏర్పాట్లు ముందస్తుగానే పూర్తిచేయాలని, నిరంతరం నిఘా ఉంచాలన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ పి కొండయ్య, ఆర్ ఓలు పుట్టపర్తి భాగ్యరేఖ, ధర్మవరం వెంకట శివ సాయి రెడ్డి, మడకశిర గౌరీ శంకర్, డీఎస్పీలు, నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

లేపాక్షి : మండలంలోని చోళసముద్ర గ్రామ పట్టణ సమీపంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో భద్రపరచిన ఈవిఎంలు, స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం జిల్లా కలెక్టర్, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీ కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన, కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ వెంట ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ కంజాక్షన్, పుట్టపర్తి, ధర్మవరం నియోజక వర్గాల ఆర్‌ఓలు భాగ్యరేఖ, వెంకటశివసాయిరెడ్డి, తహశీల్దార్లు బాలనరసింహులు, ఎస్‌ఐ గోపి, తదితరులు పాల్గొన్నారు.

27న యూనియన్ బ్యాంక్ సేవలపై అవగాహన సదస్సు



యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ దయాకర్

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 27న సోమవారం ఉదయం 10 గంటలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలపై పట్టణంలోని వాసవి ధర్మశాలలో మెగా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్థానిక యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ దయాకర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతు దేశంలోనే అత్యధిక గుర్తింపు పొందిన బ్యాంకుల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒకటని అన్నారు. యూనియన్ బ్యాంకు నియమ నిబంధనల మేరకు వ్యక్తిగత రుణాలతో పాటు వ్యాపారాలకు, వాహనాలకు (కార్లు) గహ నిర్మాణాలకు, గోల్డ్ లోన్, ఉన్నత విద్యాభివద్ధికి విద్యా రుణాలు తదితర రుణాలు మంజూరు చేస్తామన్నారు. తమ బ్యాంకు ద్వారా మంజూరు చేసే రుణ సదుపాయాలపై మెగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ జితేంద్ర కుమార్ మిశ్రా హాజరవుతున్నట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మెగా సదస్సులో పాల్గొని అర్హత గలవారు యూనియన్ బ్యాంక్ ద్వారా రుణ సౌకర్యం పొందాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం : హిందూపురం టౌన్ సబ్ డివిజన్ ముదిరెడ్డిపల్లి సెక్షన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ముదిరెడ్డిపల్లి సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ సెక్షన్ పరిధిలో ఉన్నా కొల్లకుంట, కొట్నూరు, సింగిరెడ్డిపల్లి, ముదిరెడ్డిపల్లి, బారెడ్డిపల్లి, చిన్న గుడ్డంపల్లి, పెద్దగుడ్డంపల్లి, నందమూరి నగర్, కగ్గలు, ఎం.బీరేపల్లి తదితర గ్రామాల్లో సబ్ స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది అన్నారు. ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3వ తరగతి నుంచి డిగ్రీ వరకూ శారీరక విభిన్న ప్రతిభావంతు లైన బాల బాలికలు వసతి గృహాల్లో ఉండటానికి దరఖాస్తు చేసుకోవచ్చని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎస్.అబ్దుల్‌రసూల్ శనివారం ఓ ప్రకటనలో తెలి పారు. వంద మంది విభిన్న ప్రతిభావంతులైన బాలురకు, 50 మంది బాలికలకు దరఖాస్తు చేసుకోవడా నికి అవకాశం ఉందన్నారు. బాలలు అనంతపురం హెచ్‌ఎల్‌సి కాలనీలోని వసతి గృహంలో, బాలికలు అరవిందనగర్‌లోని వసతి గృహంలో చేరవచ్చు అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో చేరిన వారికి ఉచిత వసతి, భోజనంతో పాటు దుస్తులు, నోట్ పుస్తకాలు, ట్రంకు పెట్టె, ప్లేట్లు, గ్లాసు, కాస్మోటిక్ ఛార్జీలు ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు బాలురు 91777 66540, బాలికలు 94927 60438 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-పుట్టపర్తి

బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ మక్బూల్ హుస్సేన్ తెలిపారు. అడ్మిషన్లకు సంబంధించిన బ్రోచర్లను శనివారం ప్రిన్సిపల్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్ సింగ ల్ మేజర్, బిఎ స్పెషల్ తెలుగు, బిఎ ఎకనామిక్స్ సింగల్ మేజర్, బీఎస్సీ సింగల్ మేజర్ ప్రవేశాలకు సంబంధించి అడ్మిషన్లతో పాటు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థులకు విద్యా దీవెన, విద్యావసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. అడ్మిషన్ల కోసం 94415 75211, 97011 91552 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పిల్లల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతాయుతంగా మెలగాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం పరిగి మండల పరిధిలోని కొడిగినహళ్లి స్పిన్నింగ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. తొలుత మిల్లులో జరుగుతున్న ఉత్పత్తి తదితర వివరాలను స్థానిక అధికారులతో అడిగి తెలుసుకున్నారు. దూది నుంచి దారం తీసే విధానం, నాణ్యమైన దారం ఎలా తీస్తారు, నాణ్యతను గుర్తించే విధానం, పత్తి బేళ్ల తయారీ, ప్యాకింగ్, రవాణా తదితర అంశాలపై ఆయా విభాగాల్లో కలియ తిరుగుతూ యంత్రాల పని చేసే విధానంపై జడ్జి పరిశీలించారు. ప్రస్తుతం మిల్లులో కార్మికుల కోసం అమలు చేస్తున్న విధివిధానాలపై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ కార్మికులు హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించాలన్నారు. అదే విధంగా తమ పిల్లలను తప్పనిసరిగా విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కషిచేయాలి సూచించారు. తల్లిదండ్రులు లేని చిన్నారుల పట్ల కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఇలాంటి వారిని చేరదీసి అవకాశం ఉన్నంత వరకు ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. అదేవిధంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఉచిత న్యాయం కోసం ఎప్పుడైనా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, మిల్లు జనరల్ మేనేజర్ సుబ్బరాజు, వివిధ విభాగాల ప్రధానాధికారులు నరసింహస్వామి, సునీల్ బాబు, సురేష్ బాబు, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి లైజనింగ్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మిల్లులో పత్తి నుంచి దారం తయారు చేయడానికి పరిశీలిస్తున్న ఏడిజె కంపల్లె శైలజ

శరవేగంగా జాతీయ రహదారి పనులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ముదిగుబ్బ-కోడూరు(342) జాతీయ రహదారి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి మీదుగా కోడూరు వరకూ నాలుగు వరుసల రహదారి పనులు డిసెంబర్ 4, 2022వ తేదీన ప్రారంభించారు. పనులు ప్రారంభించిన 15 నెలల్లోనే పనులు శరవేగంగా పూర్తవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 80 కిలోమీటర్ల ఈ జాతీయ రహదారి రూ. 401 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. మొదటి ఫేజ్‌లో ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి వరకూ 32 కిలోమీటర్ల మేర పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. బుక్కపట్నం మండలంలోని పలు చోట్ల కాజ్‌వేల నిర్మాణం, గూనిపల్లి వద్ద కొండను తొలగించడం వంటి పనులు మినహా 70 శాతం పూర్తి కావస్తున్నా యి. రెండవ ఫేజ్‌లో పుట్టపర్తి నుంచి కోవెలగుట్టపల్లి, యనమలపల్లి, బీడుపల్లి, బ్రాహ్మణ పల్లి మీదుగా జగరాజుపల్లి వద్ద ప్రధాన రహదారిలో కలిసే విధంగా నూతన రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం కొండలు, గుట్టలు ఉన్నందున పనులు ఆలస్యంగా సాగుతున్నాయి. అంతేకాక కోవెల గుట్టపల్లి గ్రామం వద్ద చిత్రావతి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ వంతెన నిర్మాణం పూర్తయ్యేలోపు మిగతా రోడ్డు పనులు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నాలుగు వరుసల రహదారి నుంచి పుట్టపర్తిలోకి అనుసంధానం చేయడానికి పలు కనెక్టివిటీ రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. పుట్టపర్తి నుంచి కోడూరు వరకూ 48 కిలోమీటర్ల మేర ఈ జాతీయ రహదారి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే బడే నాయక్ తండా వద్ద నుంచి మారెమ్మ కనుమ వరకూ రెండు వరుసల రోడ్డు దాదాపు 3 కిలోమీటర్ల మేర పూర్తయింది. అలాగే పెడపల్లి వద్ద నుంచి కరావులపల్లి తండా వరకు 3 కిలోమీటర్ల మేర పూర్తయింది. ఈ రహదారి పనులు పూర్తయితే, బీడుపల్లి, బ్రాహ్మణపల్లి, జగరాజుపల్లి, పెడపల్లి, గుమ్మయ్యగారిపల్లి, తదితర గ్రామాలు మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. అంతేకాక పుట్టపర్తి నుంచి బెంగళూరుకు ప్రయాణ దూరం తగ్గడమే కాక సులభతరం అవుతుంది.



జాతీయ రహదారి పనుల్లో భాగంగా జగరాజుపల్లి వద్ద కాజ్‌వే నిర్మాణం

రఘువీరారెడ్డికి బిసిజి వ్యాక్సిన్



రఘువీరారెడ్డికి బిసిజి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

మడకశిర రూరల్

మండలం లోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం వైద్య సిబ్బంది బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయవర్ధన్ సిడబ్ల్యుసి మెంబర్, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డికి బిజిజి వ్యాక్సిన్ వేశారు. అలాగే ఆరోగ్యానికి సంబంధించి పలు సలహాలు చేశారు.

ముగిసిన వేసవి కంప్యూటర్ శిక్షణ



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

చిలమత్తూరు : మిథున్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఎస్‌ఎస్‌వైవిఎన్‌లో నిర్వహించిన వేసవి కంప్యూటర్ ఉచిత శిక్షణ తరగతులు ముగిసినట్లు నిర్వాహకులు బాలాజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తెలిపారు. వేసవి సెలవుల ప్రారంభం నుంచి సుమారు 450 మంది విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్‌పై శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఉచిత శిక్షణకు పాఠశాల ప్రధానోపాధ్యా యులు నరసింహారెడ్డి సహకరించడంతో ఉచిత శిక్షణకు భారీ స్పందన లభించిందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ముందు ముందు మరిన్ని చేపడతామని తెలిపారు.

రాష్ట్రంలో వైసిపిదే గెలుపు

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, గోరంట్ల మాధవ్



విలేకరులతో మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి, మాధవ్

ప్రజాశక్తి-అనంతపురం

సార్వత్రిక ఎన్నికల్లో గెలవబోయేది వైసిపినే అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శనివారం అనంతపురంలో ఎంపి గోరంట్ల మాధవ్ నివాసంలో ఆయనతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లలో వైసిపి గెలవబోతోందని జోస్యం చెప్పారు. హిందూపురంలో బాలకృష్ణ, కుప్పంలో చంద్రబాబు, పిఠాపురంలో పవన్‌కళ్యాణ్ ఓడిపోతున్నారన్నారు. రాష్ట్రంలో 164 అసెంబ్లీ సీట్లలో వైసిపి గెలవబోతోందని, కేవలం 4 సీట్లకు మాత్రమే చంద్రబాబు పరిమితం కాబోతున్నారన్నారు. బిజెపి, జనసేన 7 సీట్లలో గెలవబోతోందన్నారు. టిడిపి గెలుస్తుందని పందేలు ఆడి ఎవరూ మోసపోవద్దన్నారు. సంక్షేమ పథకాలకు మద్దతుగా, ప్రభుత్వం చేసిన సాయానికి మద్దతుగా ఓటింగ్ జరిగిందని, రాష్ట్రంలో జగనన్న ప్రభంజనం నడిచిందన్నారు. ఎంపి గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్సార్ జగన్‌మోహన్‌రెడ్డి 152కు పైగా ఎమ్మెల్యే స్థానాలు, 22కు పైగా ఎంపీ స్థానాలు గెలవబోతున్నామని చేసిన ప్రకటనతో తెలుగుదేశం పార్టీ నాయకుల గుండెలు పగిలిపోయాయన్నారు. జూన్ 9 ఉదయం 9.38 నిముషాలకు, విశాఖపట్నం రుషికొండలో జగన్మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారన్నారు.

కక్షతోనే కార్మికుల వేతనాల నిలుపుదల

◆ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి ◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి సాగునీటి పథకం కింద పని చేసే ఉద్యోగుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించి మూడు నెలలుగా జీతాలు నిలిపివేసిన కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి అనుకూలంగా లేరన్న ఉద్దేశంతో 21 మంది కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు వేయకుండా కక్షపూరితంగా కాంట్రాక్టర్ శివశంకరరెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులకు మూడు నెలలు బకాయి వేతనాలు, పిఎఫ్ 13శాతం వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు చెల్లిస్తున్న వేతనాల్లో ప్రతి కార్మికుని నుంచి రూ.2,200 కోత కోయడం దారుణం అన్నారు. చట్టవిరుద్ధంగా కోత విధించిన సొమ్మును కార్మికులకు వెనక్కు ఇచ్చేయాలన్నారు. 2023-24 డిసెంబర్, జనవరి నెలల జీతాలు ఎవరు వేస్తారన్న దానిపై కూడా స్పష్టత ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. ఇక వేతనాలు అడుగుతున్న కార్మికులపై అక్రమ కేసులు బనాయించడానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కార్మికులను నిత్యం వేధిస్తుండడం దుర్మార్గం అన్నారు. కార్మికులు వేతనాలు కావాలంటే ప్రతినెలా ఆందోళనలు, సమ్మె చేయాల్సిన పరిస్థితులను ప్రభుత్వం, అధికారులు కల్పిస్తున్నారని తెలియజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒకే పథకాన్ని ముక్కలు ముక్కలుగా చేసి కాంట్రాక్టర్ గొప్ప చెప్పడం పెద్ద దోపిడీ అన్నారు. మడకశిర, హిందూపురం ప్రాంతాల్లో నిర్వహణ ఉన్న కాంట్రాక్టర్లు కళామనాయుడు, గోవర్ధన్‌రెడ్డి 18 నెలలుగా కార్మికులకు పిఎఫ్ చెల్లించలేదన్నారు. వారిపైన ఇప్పటి వరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఫేస్-4కింద రాయదుర్గం, కళ్యాణదుర్గం డివిజన్‌లో లైన్‌మెన్లు, పంపు ఆపరేటర్లు, ఫిట్టర్లు దాదాపు195 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. నీటి సరఫరాలో లీకేజీలు అయితే మరమ్మతుకు అవసరం అయ్యే వస్తువులను కార్మికులే తెచ్చుకుని వేధిస్తున్నారన్నారు. ఈ సమస్యలన్నింటిపై సంబంధిత అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సచివాలయాల్లో జాడలేని వీఆర్‌ఒలు!

1-బి, అడంగల్ కోసం ఇబ్బందుల్లో రైతులు..

ప్రజాశక్తి-నంబులపూలకుంట

వీఆర్‌ఒలు ప్రజలు, రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై స్పందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక సచివాలయం ఏర్పాటు చేసింది. అయితే నంబులపూలకుంట సచివాలయాల పరిధిలో పని చేస్తున్న వీఆర్‌ఒలు తూతూ మంత్రంగా అక్కడ విధులు నిర్వహిస్తూ ఎక్కువ సమయం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉంటూ కాలక్షేపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న ప్రతి రైతు ఇప్పుడు రెన్యువల్ చేయాల్సి ఉంది. రెన్యువల్ చేయాలంటే ప్రతి రైతు వద్ద వారి భూమికి సంబంధించి 1-బీ, అడంగల్ తప్పనిసరిగా ఉండాలి. అయితే చాలా మంది రైతులకు వెబ్ ల్యాండ్‌లో భూమి తక్కువ చూపడం, వారి పేరు లేకపోవడం, ఒకరి పేరు బదులు మరొకరి పేరు ఉండడం, తదితర కారణాలతో ప్రతిరోజూ అనేకమంది రైతులు సచివాలయం వద్దకు వస్తున్నారు. అక్కడ వీఆర్‌ఒలు అందుబాటులో లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో తహశీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉంటున్నారు. వారు అక్కడ కూడా అందుబాటులో లేకపోవడంతో చెప్పులరిగేలా తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వీఆర్‌ఒలు గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


సచివాలయంలో ఖాళీగా ఉన్న వీఆర్‌ఒ కుర్చీ

వర్షాలకు కూలిన విద్యుత్ స్తంభాలు

పనుల నాణ్యతపై విమర్శలు

ప్రజాశక్తి-రొద్దం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలుతున్నాయి. మండలంలోని ప్రతి గ్రామానికి విద్యుత్ నూతన లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఎక్కువ భాగం కాలువలు ఉండడంతో కాంట్రాక్టర్లు అందులోనే గుంతలు తీసి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. దీంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు, శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని రొద్దం నుంచి బూచెర్ల వెళ్లే ప్రధాన దారిలో రోడ్డు పక్కనే ఓ విద్యుత్ స్తంభం పొలంలోకి ఒరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీనికితోడు అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు కొంతవరకూ వాలిపోగా, మరికొన్ని చోట్ల పూర్తిగా పడిపోయాయి. ఇంకా విద్యుత్ లైన్ తీగలు లాగక మునుపే ఇలా స్తంభాలు పడిపోవడంతో చూసిన వారు కాంట్రాక్టర్ తీరుపై మండిపడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్లు పనులు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కూలడంతో విరిగిపోయిన విద్యుత్ స్తంభం


ఓ వైపు ఒరిగిన విద్యుత్ స్తంభం

అధికారి మారినా బోర్డులో పేరు అలానే..!

నంబులపూలకుంట : ఎంపిడిఒ ఆదినారాయణ గత నెలలో ఉద్యోగ విరమణ పొందారు. అయినా బోర్డులో మాత్రం పేరు మారలేదు. దీంతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బోర్డులో ఉన్న పేరును తొలగించి ప్రస్తుతం ఉన్న ప్రజా సమాచార అధికారి పేరు, మొబైల్ నెంబరు రాయాలని ప్రజలు కోరుతున్నారు.


ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో పేరు మారని బోర్డు

హిందీ పరీక్షకు 70 శాతం గైర్హాజరు : డిఇఒ

కొత్తచెరువు రూరల్ : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు డిఇఒ మీనాక్షి తెలిపారు. శనివారం హిందీ పరీక్ష నిర్వహించగా 938 మందికి గానూ 285 మంది విద్యార్థులు హాజరు కాగా 653 మంది గైర్హాజరయ్యారు. కేవలం 30 శాతం మంది మాత్రమే హిందీ పరీక్షకు హాజరైనట్లు డిఇఒ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 29 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఎక్కడా ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహించే కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు, స్పెషల్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

ఖాద్రీశుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

దర్శనానికి 5 గంటల సమయం

కదిరి అర్బన్ : పట్టణంలో వెలసిన ప్రసిద్ధ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు, శనివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తజనం పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో క్యూలైన్లలో వృద్ధులు, మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రక్షణ గోపురం మార్గంలో ఆలయ ఆవరణలో ఐదారు క్యూ లైన్లలో భక్తులు వేచి ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి నైవేద్యానికి దర్శనం నిలిపివేశారు. దీంతో వేచివున్న పరిస్థితుల్లో భక్తులు క్యూలైన్లలోనే నేలపై కూర్చొని సేద తీరారు. దీనికి తోడు ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ మరింత ఎక్కువైంది. అడుగు తీసి అడుగు వేసే అవకాశం లేని విధంగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలో ఎటువైపు చూసినా సేద తీర్చేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్వామి వారి దర్శనం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో సౌకర్యాలు, దర్శనం ఆలస్యం కావడం, భక్తుల ఇబ్బందులపై ఆలయ ఈవో శ్రీనివాస రెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

కదిరిలో మజ్జిగ చలివేంద్రం

కదిరి అర్బన్ : గణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులతో పట్టణంలోని బాలిక పాఠశాల ఎదురుగా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కళ్యాణ్‌స్వామి తెలిపారు. వేసవి కాలం కావడంతో దాదాపు రెండు నెలల క్రితం ప్రజల కోసం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. దాతల సహాయ, సహకారాలతో 52 రోజులుగా నిరంతరాయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంకాలం వరకూ చల్లని నీరు, మజ్జిగ అందుబాటులో ఉంచుతామన్నారు. దాతల సహాయ సహకారాలు ఉన్నంత వరకూ ఈ మజ్జిగ చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాపంగా ఎవరైనా చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను పెద్ద సంఖ్యలో సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, అదే తరహాలో కౌంటింగ్ ప్రక్రియ కూడా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే పోలీసుల లక్ష్యమని అందు కోసమే రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్, తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం జిల్లా వ్యాప్తంగా సిఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బందితో కలసి సమసాత్మక ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. అక్రమంగా దాచి ఉంచిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, బాణసంచా, పెట్రోల్, డీజిల్‌తో పాటు సరైన ధ్రువీకరణ పత్రాలు లేని, అనుమానిత వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్లలో సిఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. మడకశిర సర్కిల్ పరిధిలో అనుమతులు లేని 18 ద్విచక్ర వాహనాలు, సికె పల్లి మండలంలో 6 బైక్‌లను సీజ్ చేశారు. అలాగే అనుమానిత ప్రదేశాల్లో క్షుణంగా సోదాలు చేశారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో, ఫలితాల తర్వాత జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలను పరిరక్షించే ఉద్దేశంతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అణచివేసి, అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లాలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో పాటు, శాంతి కమిటీల వారితో పోలీసులు సమావేశం నిర్వహించి ఎన్నికల కౌంటింగ్ అనంతరం కూడా ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా అందరూ సహకరించాలని సూచనలు చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినా, ఘర్షణలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని గ్రామసభల ద్వారా ప్రజలకు సూచించారు.

ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు సీజ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని కప్పలబండ గ్రామ సమీపంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని శనివారం సిపిఎం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలు పలు సమస్యలను విన్నవించారు. 7 వారాల నుంచి కూలీలు పని చేస్తున్నారని, చేస్తున్న పనులకి ఇంతవరకూ పేస్లిప్పులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 3 వారాల బిల్లులు మాత్రమే చెల్లించారని ఇంకా 4 వారాల బిల్లులు చెల్లించాలని తెలిపారు. పనికి తగ్గ వేతనం రావడం లేదని, కూలి చెల్లింపుల్లో వ్యత్యాసాలు ఉన్నాయని ఉపాధి కూలీలు పెద్దన్న ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై పెద్దన్న మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూలీలు ఐక్యంగా పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని, కూలీలకు సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.


కూలీలతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు పెద్దన్న

శతాధిక వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని మానేపల్లి గ్రామపంచాయతీకి చెందిన శతాధిక వృద్ధుడు భట్టికర చంద్రయ్య (101) శనివారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. ఈయన 1923లో మానేపల్లిలో జన్మించారు. 18 ఏళ్ల వయసులో మహాత్మాగాంధీ పిలుపుమేరకు స్వాతంత్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. స్వాతంత్రోద్యమం సమయంలో మహాత్మ గాంధీజీ హిందూపురం పర్యటనకు రాగా అక్కడికి వెళ్లి చూసినట్టు ఆయన తరుచూ చెబుతూ ఉండేవారు. ఆయన వందేళ్లు పూర్తి చేసుకున్నందుకు గానూ గత ఆగస్టులో పంద్రాగస్టున మానేపల్లి గ్రామ సచివాలయంలో సచివాలయం ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. చంద్రయ్య తాను పాల్గొన్న స్వాతంత్ర ఉద్యమ విశేషాలు, బ్రిటీషు కాలం నాటి పరిస్థితులను గ్రామస్తులకు వివరించేవారు. 1947లో స్వాతంత్రం సిద్ధించినప్పుడు చంద్రయ్య తన మిత్రులతో కలిసి గ్రామంలో పెద్దఎత్తున సంబరాలు జరిపి అందుకు గుర్తుగా ఓ రాతి దిమ్మె శాసనాన్ని కూడా గ్రామ సచివాలయం ముందు ఏర్పాటు చేశారు. వందేళ్లు జీవించిన చంద్రయ్య మృతి పట్ల గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


భట్టికర చంద్రయ్య (ఫైల్‌ఫొటో)


ఆందోళనకారులను చెదరగొట్టడంపై పోలీసుల మాక్ డ్రిల్

పోలీసుల మాక్ డ్రిల్

ధర్మవరం టౌన్ : జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సబ్ డివిజన్‌లోని సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది శనివారం సాయంత్రం పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. 144 సెక్షన్‌తో పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రజలు గుంపులుగా ఉన్నా అక్రమంగా సమావేశాలు నిర్వహించినా, ధర్నాలు, నిరసనలు, ఉత్సవాలు చేయడం చట్టరీత్యా నేరమని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. నిరసనలను చెదరగొట్టే క్రమంలో పోలీసులు గుంపులుగా ఉన్న ప్రజలపై మొదట మైకు ద్వారా హెచ్చరికలు జారీ చేసి గుంపులు చెదిరిపోని పక్షంలో భాష్పవాయువు, లాఠీచార్జి చేస్తామన్నారు. అయినా గుంపులు చెదిరిపోకపోతే శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా చివరిగా గుంపుపై పోలీసులు కాల్పులు జరిపి ప్రజల ధన, మాన, ప్రాణ నష్టం వాటిల్లకుండా తీసుకునే చర్యలపై పోలీసులు మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్‌లో వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, టూ టౌన్ సిఐ అశోక్ కుమార్, ఎస్ఐ నరేంద్ర, పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.


వీడియో ద్వారా సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డిఆర్‌ఓ కొండయ్య

కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ పూర్తి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ శిక్షణ పూర్తయిందని డిఆర్ఓ కొండయ్య తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణకు మొత్తం 915 మంది హాజరయ్యారు. డిఆర్ఓ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ప్రకారం కౌంటింగ్ సిబ్బందికి నియామక ఉత్తర్వులను సంబంధిత తహశీల్దార్ ద్వారా అందిస్తామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి మలివిడత ఆ నియోజకవర్గ స్థాయిలో రిటర్నింగ్ అధికారులు ఓట్ల లెక్కింపుపై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ తరగతులకు గైర్హాజరైన సిబ్బందిపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మూడవ ర్యాండమైజేషన్ శిక్షణలో భాగంగా టేబుళ్లపై ఏ విధంగా ఓట్లు లెక్కించాలో అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రొద్దం : మండలంలోని శ్రీసాయి రూరల్ డెవలప్మెంట్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సాయివిద్యామందిర్ ఆవరణలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, జిల్లా మహిళా అధ్యక్షులు సుబ్బరత్నమ్మ తెలిపారు. హిందూపురం పట్టణంలోని శ్రీఆశ్రయ మల్టీ స్పెషల్ హాస్పిటల్ సిబ్బంది సహకారంతో నిర్వహించిన శిబిరంలో కిడ్నీ సంబంధిత వ్యాధులకు వైద్య సేవలు అందించారు. శిబిరానికి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి 120 మంది తరలివచ్చి వైద్య సేవలు పొందారు. అందులో 70 మందికి వివిధ సమస్యలు ఉన్నాయని వారిని ఆదివారం హిందూపురం వైద్యశాలకు తీసుకెళ్తున్నట్లు వైద్యులు తెలిపారు. శిబిరాన్ని నరసింహులు, సుబ్బరత్నమ్మ దగ్గర ఉండి పర్యవేక్షించారు.

ఎన్‌టిఎఫ్ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా సాకే రాజశేఖర్

ధర్మవరం టౌన్ : నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్(ఎన్‌టిఎఫ్) రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా ధర్మవరం పట్టణానికి చెందిన సాకే రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఎన్‌టిఎఫ్ జాతీయ అధ్యక్షుడు కుంబార రవిబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మనుపాటి నవీన్ సాకే రాజశేఖర్‌కు విజయవాడలో నియాయక పత్రాలు అందజేశారు. సాకే రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనుల సమస్యలపై పోరాడుతానని తెలిపారు.


నియామక పత్రం అందుకుంటున్న సాకే రాజశేఖర్


ఉద్యోగాలకు ఎంపికైన సత్యకృప మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

'సత్యకృప' విద్యార్థినులకు ఉద్యోగాలు

ధర్మవరం టౌన్ : చెన్నైకు చెందిన అల్ ట్రస్ట్ కంపెనీలో తమ కళాశాల విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు పట్టణంలోని సత్యకృప మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి తెలిపారు. పట్టణంలోని సత్య కృప మహిళా డిగ్రీ కళాశాలలో చెన్నైకు చెందిన అల్ ట్రస్టు కంపెనీ ప్రతినిధులు తరుణ్‌కుమార్, నాగేంద్ర శనివారం తృతీయ సంవత్సరం చదువుతున్న వంద మంది విద్యార్థినులను ఇంటర్వ్యూ చేశారు. వారిలో 26 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ తెలిపారు. వీరికి కంపెనీ ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన వారిని కరస్పాండెంట్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

కొత్తచెరువురూరల్ : వేసవి సెలవుల్లో గ్రంథాలయంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కె.జయరాం తెలిపారు. విద్యార్థులకు స్థానిక గ్రంథాలయంలో 11 రోజులుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా శనివారం పుస్తక పఠనం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, కథల గురించి విద్యార్థులకు తెలియజేశామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠకులు మహమ్మద్, రాఘవ, రాజేష్, కిష్టప్ప, మోహన్, రామాచారి, వాచ్‌మెన్ మునీరు, పాల్గొన్నారు


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న అధికారి కె.జయరాం

నేరాలు ఘోరాలు


ప్రమాదంలో గాయపడిన సుశీల, బాజాజీనాయక్ దంపతులు

కారు, బైక్ ఢీ.. దంపతులకు గాయాలు

నల్లచెరువు : కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మండలంలోని జోగన్నపేట సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలం లోని బాలేపల్లితండాకు చెందిన బాలాజీనాయక్, సుశీల దంపతులు ద్విచక్ర వాహనంపై కదిరి నుంచి స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో జోగన్నపేట సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అంతర్రాష్ట్ర రైల్వే దొంగ అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అంతర్రాష్ట్ర రైల్వే దొంగను అరెస్టు చేసినట్లు రైల్వే జీఆర్పి సిఐ నాగరాజు తెలిపారు. సిఐ విలేకరులతో మాట్లాడుతూ దొంగ సాబన్న స్వగ్రామం కర్నాటకలోని యాదగిరి. ఇతడు యాదగిరి రైల్వే స్టేషన్‌లో రైలెక్కి యశ్వంతపూర్ వరకూ(వయా గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, హిందూ పురం మీదుగా) రైళ్లలో తరచూ ప్రయాణం చేసేవాడు. రైళ్లలో సెల్‌ఫోన్లు, నగదు, ఇతర విలువైన వస్తువులను దొంగలించి తద్వారా వచ్చిన సొమ్ముతో జల్సాగా బతికేవాడు. ఇతడి గురించి ధర్మవరం రైల్వే ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు ఖచ్చితమైన సమాచారం అందడంతో ధర్మవరం ఆర్‌పిఎఫ్ ఎస్ఐ ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారన్నారు. ధర్మవరం ఆర్‌పిఎఫ్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది సహకారంతో శుక్రవారం దొంగను అరెస్టు చేసి, గుంతకల్లు, ధర్మవరం రైల్వే పోలీస్ స్టేషన్లకు సంబంధించిన చోరీల కేసుల్లోని రూ. 1,55,000 విలువ చేసే సెల్‌ఫోన్లు, ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకు న్నారు. అనంతరం గుంతకల్లు రైల్వే కోర్టులో హాజరు పరిచారు. ఇతడిపై బెంగళూరు జీఆర్పి స్టేషన్‌లో 5 చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. రైలు ప్రయాణికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

గాండ్లపెంట : మండలంలోని తూపల్లి పంచాయతీకి చెందిన భవతి(15) అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎఎస్ఐ రంగనాయక తెలిపిన వివరాలు.. కడుపునొప్పి తీవ్రంగా ఉండటంతో మనస్థాపానికి గురైన భవతి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి శివారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామన్నారు.

రైలులో గుర్తు తెలియని మృతదేహం

హిందూపురం : పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న రైలులో గుర్తు తెలియని మతదేహం శనివారం రైల్వే పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జిల్లా అసుపత్రికి తరలించారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రూ. 1.46 లక్షల టపాసులు సీజ్ : సిఐ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

అందిన సమాచారం మేరకు పట్టణంలో సోదాలు చేసి రూ. 1,46,210 విలువ చేసే టపాసు లను సీజ్ చేసినట్లు ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సిఐ పి.యతీంద్ర తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. ముదిగుబ్బ పట్టణంలో సోమల నాగార్జున నాయుడు ఎలాంటి అనుమతులు లేకుండా పెద్దఎత్తున టపాసులు అక్రమంగా నిల్వ ఉంచి నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేసేందుకు బయల్దేరాడ న్నారు. దీంతో అప్రమత్తమైన నాగార్జుననాయుడు టపాసులను మరో చోటికి తరలిస్తుండగా ముదిగుబ్బ హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారన్నారు. అలాగే అతడి నుంచి రూ. 1,46,210 విలువ చేసే టపాసు లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండ గా ఎవరైనా నియమాలను ఉల్లంఘించి టపాసులు అక్రమంగా నిల్వ ఉంచినా, వ్యాపారం చేసినా వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.


సీజ్ చేసిన టపాసులతో సిఐ యతీంద్ర

మండల వ్యాప్తంగా అప్రకటిత విద్యుత్ కోత

ఇబ్బందులు పడ్డ ప్రజలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 10 నుంచి సాయంకాలం 6 గంటల వరకూ అప్రకటిత విద్యుత్ కోత విధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు, విద్యుత్ ఆధారిత చేతి వృత్తుల వారు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. ఏదైనా అవాంతరాలు ఏర్పడితే విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సిన పరిస్థితి ఉంటే సంబంధిత అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే శనివారం సుమారు గంటల పాటు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాను ఆపివేసినా సంబంధిత అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం వారి నిర్లక్ష్య వైఖరిని చాటుతోంది.

అడకత్తెరలో అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది అధికారుల పరిస్థితి. మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో తాడిపత్రిలో చోటు చేసుకున్న ఘర్షణకు అధికారులపై వరుసగా వేటు పడుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఘర్షణను సీరియస్‌గా తీసుకుని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌పై వేటు వేసింది. ఈయనతోపాటు డీఎస్పీ గంగయ్య, సిఐ మురళీకృష్ణలపైనా వరుసగా వేటుపడ్డాయి. అంతటితోనే కాకుండా ఈ మొత్తం వ్యవహారంలో వైఫల్యాలను ఎత్తి చూపాలని ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించింది. ఈ విచారణ బృందం గత వారంలో తాడిపత్రిలోనే మకాం వేసి మొత్తం వివరాలను ఆరా తీస్తోంది. ఎక్కడ వైఫల్యం జరిగింది. ముందుగా గుర్తించి ఎందుకు నివారించకలేక పోయారు. అన్న పూర్తి వివరాలను సేకరించే పనిని ప్రత్యేక విచారణ బృందం చేపడుతోంది. ఇదే సమయంలో జిల్లాకు కొత్త ఎస్పీని నియమించింది. గౌతమి శాలి బాధ్యతలు చేపట్టారు. మొదట జరిగిన పరిణామాలను చూసి ఆమె ఎన్నికల ఫలితాల లెక్కింపు సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏ విధంగా చర్యలు తీసుకోవాలన్న అంశాలపై దృష్టి సారించారు. అకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఏ చిన్న తప్పు జరిగినా ఎన్నికల సంఘం వేటు పడే అవకాశాలున్నందున క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసే పనిని చేపట్టింది. జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కూడా ఓట్ల లెక్కింపుపై దృష్టి సారించారు. ఎక్కడా ఎటువంటి సమస్యల్లేకుండా జాగ్రత్తగానూ, సజావుగా పూర్తయ్యే విధంగా చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గరపడుతున్న కొద్ది రాజకీయంగానూ ఉత్కంఠతన నెలకొంది. అభ్యర్థులు పోలింగ్ జరిగిన తీరుతో పాటు, ఏ ప్రాంతంలో ఎన్ని ఓట్లు వస్తాయన్న మదింపు వేసుకునే పనిలోనున్నారు. ఇంకోవైపు గెలుపోటములపై పెద్దఎత్తున బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది... ఏ అభ్యర్థి విజయం సాధిస్తారు తదితర అంశాలతో జోరుగా బెట్టింగ్ నడుస్తుండటం గమనార్హం. రాజకీయ వాతావరణం ఈ రకంగా ఉండే వాతావరణం మాత్రం చల్లబడింది. మే మొదటి వారం వరకు పెద్దఎత్తున ఎండలు మండినప్పటికీ రెండవ వారం నుంచి వర్షాలు పడుతుండటంతో వాతావరణం చల్లబడింది. గత వారంలోనూ జిల్లాలో విస్తారంగా వర్షాలు పడ్డాయి. గతేడాది వర్షాభావం ఎదుర్కొన్న రైతాంగం ఈసారి ముందస్తు వర్షాలతో ఉత్సాహం నెలకొంది. సబ్సిడీ విత్తనకాయల పంపిణీ కూడా ప్రారంభమవడంతో విత్తనాలు కొనుగోళ్లు, సాగుకు పొలాలను సిద్ధం చేసుకోవడం వంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్నారు. మే ఆఖరు వారంలలోనే జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడ్డాయి. ఇది ఆనందించదగిన విషయం. జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు కూడా వస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది. అంటే ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో మంచి వర్షాలే పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాలు బాగా వచ్చే అవకాశాలుండటంతో సాగుకు సమయత్తమయ్యే రైతులు విత్తు కోసం వెతుకులాట ప్రయత్నంలో ఉన్నారు. బ్యాంకులు, ఇతర ప్రయివేటు వ్యాపారులతో వడ్డీకి డబ్బులు సమకూర్చుకునే పనిలో పడ్డారు. ఇదే వాతావరణం కొనసాగితే జూన్ నెలలోనే విత్తనాలు విత్తుకునే పనిలో పడ్డారు.

